



ఎండకు తాళలేక సోడా తాగుతున్న యువకులు

దళిత స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానించారు

సంగారెడ్డిలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డి క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అవమానించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సంగారెడ్డి పట్టణంలో ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. దళితులను మోసం చేసిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచిపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి చేర్యాల్ ఆంజనేయులు, తోపాజీ అనంతకిషన్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల అధ్యక్షుడు మోతీలాల్, సిద్దన్న, బుచ్చిరాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్, యాదగిరి, బాలు, నరేన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి పట్టణంలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫొటోలు : జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సన్ డే

మధ్యాహ్నం నిర్మానుష్యంగా సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా



బెజ్జంకిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

మెదక్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గుమంటున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. 24 గంటల్లో జిల్లాలోని బెజ్జంకిలో అత్యధికంగా 41.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే రెండు డిగ్రీలు అధికమని వాతావరణశాఖ పేర్కొన్నది. పోతారెడ్డిపేటలో 40.9, నారాయణరావుపేటలో 40.6, దౌల్తాబాద్‌లో 40.4, చిట్యాలలో 40.2, సిద్దిపేటలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మహాసముద్రం గండి అభివృద్ధికి కార్యాచరణ

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఉమ్మాపూర్ శివారులోని మహాసముద్రం గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని ఉమ్మాపూర్ శివారులోని మహాసముద్రం గండి ప్రాంతాన్ని టూరిజం కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు యాక్షన్‌ప్లాన్ తయారు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక నాయకులతో కలిసి మహాసముద్రం గండి ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చిత్తారి రవీందర్ తదితరులు ఉన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

జగదీశ్వర్‌రెడ్డి, ఆయనకు వత్తాసు పలికిన కేటీఆర్‌పై భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు 8

జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం

వృక్ష విలాపం

సిద్దిపేటలో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- విద్యుత్, మున్సిపల్ శాఖ ఇష్టారాజ్యం
- తీగలకు తాకుతున్నాయని ఏకంగా వృక్షాల నరికివేత
- మోడువారుతున్న హరితహారం చెట్లు
- మండు వేసవిలో పట్టణంలో నీడ కరువాయే..
- చోద్యం చూస్తున్న మున్సిపల్, ఇతర శాఖలు

సిద్దిపేట నడిబొడ్డున ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్ల ఇళ్ల ముంగిట పచ్చని చెట్లను నరికివేశారు. విద్యుత్ తీగలకు కొమ్మలు తాకుతున్నాయనేదే కారణం. కానీ కొమ్మలకు బదులు చెట్టు మొదళ్ల దాకా వేటు వేస్తుంటే అడ్డుకోవాల్సిన కౌన్సిలర్లు చోద్యం చూశారట. తమకేమి పట్టనట్లుగా ఉన్నారట. ఇంకేముంది.. మున్సిపల్ విద్యుత్ శాఖలు ఒక్కటై అవకాశం దొరికినట్లుగా భావించి వీధివీధుల్లో వృక్షాలపై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఇదే సిద్దిపేట పట్టణంలోని మెదక్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, కరీంనగర్ రోడ్డుతోపాటు ప్రధాన కూడళ్లలోనూ నిత్యం చెట్ల నరికివేత కార్యక్రమం ఇష్టారాజ్యంగా సాగుతోంది. హరితహారానికి ఆదర్శంగా ఉన్న సిద్దిపేట పట్టణం ఈ చర్యలతో కళ తప్పుతోంది. స్థానికులు సైతం విస్తుపోతున్నారు. మున్సిపల్, అటవీ అధికారుల వైఖరిపై మండిపడుతున్నారు. వేసవిలో చల్లటి గాలిని అందించే చెట్లను తెగ నరకడంపై సర్వత్రా అసహనం వెల్లువెత్తుతోంది.



ఓ వీధిలో నరికిన చెట్టు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 16 : రాష్ట్రంలోనే అత్యధికంగా మొక్కలు నాటిన పట్టణంగా సిద్దిపేటకు తిరుగులేని రికార్డు ఉంది. ఈ పట్టణానికి పచ్చని చెట్లే ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. మొక్కలు నాటడంలో భారీ లక్ష్యాలను నిర్ణయించి గమ్యం చేరడంలోనూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవ అత్యంత కీలకం. మొక్కలను పసిపిల్లలుగా సంబోధిస్తు వాటిని సంరక్షించడంలో ఆయన ఒక యజ్ఞంలా ముందడుగు వేయడంతోనే ఇది సాధ్యమైంది. మొక్కలు వంగినా, చెట్టు కొట్టినా ఉపేక్షించేవారు కాదు. ఇలా ఎదిగిన చెట్లను నేడు నేలమట్టం చేస్తున్న పరిస్థితి సిద్దిపేటలో దాపురించింది.

నిత్యకృత్యంగా నరికివేత

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉంటే చాకచక్యంగా కొమ్మలు తొలగించాల్సిన చోట ఏకంగా చెట్టు మొదళ్లపై వేటు వేస్తున్నారు. గతంలోనూ విద్యుత్ శాఖ ఇదే విధంగా వ్యవహరించింది. ఆనాడు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి

మిగతా 8వ పేజీలో



మొదలు వరకు నరికిన దృశ్యం

సిద్దిపేట పట్టణంలో చెట్లను మధ్య వరకు నరికివేసిన విద్యుత్ సిబ్బంది

ఫటాఫట్

గౌరవెల్లి కాలువలకు త్వరలో

భూసేకరణ పూర్తి చేస్తాం

- ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణపై గ్రామసభ ఏర్పాటు చేస్తున్నాం
- హుస్నాబాద్ ఆర్డీవో వి.రామ్మూర్తి



హుస్నాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి సంబంధించి 600 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, దీనిని త్వరలో పూర్తి చేస్తా మని హుస్నాబాద్ ఆర్డీవో వి.రామ్మూర్తి తెలిపారు. అలాగే అక్కన్నపేట మండలం చౌటపల్లి వద్ద ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ చేశామని, రెండు, మూడు రోజుల్లో గ్రామసభ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు.

గౌరవెల్లి కాలువల నిర్మాణానికి ఎన్ని ఎకరాలు సేకరిస్తున్నారు?

గౌరవెల్లి రిజర్వాయర్ మొత్తం కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.473 కోట్లను మంజూరు చేసింది. కాగా, హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో దాదాపు 600 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

భూసేకరణ ఎంత వరకు వచ్చింది?

భూసేకరణపై ప్రస్తుతం మూడు మండలాల్లోని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నాం. అవి కూడా పూర్తవుతున్నాయి. రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తున్నాం. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని అవార్డు పాస్‌చేస్తాం.

ఎప్పటివరకు పూర్తవుతుంది. రైతులు సమ్మతిస్తున్నారా?

రెండు నెలల్లో పూర్తి చేస్తాం. పంట పొలాలకు నీరు అవసరం ఉన్న దృష్ట్యా రైతులు సానుకూలంగా స్పందిస్తున్నారు. త్వరలో కాలువల నిర్మాణం చేపట్టి మెట్టరైతుల సాగునీటి ఆశలను నెరవేరుస్తాం.

ఇండస్ట్రియల్ పార్క్‌కు ఎన్ని ఎకరాలు భూమిని సేకరిస్తున్నారు?

అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామం వద్ద ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 124.35 ఎకరాల భూమి సేకరిస్తున్నాం. ఇప్పటికే సంబంధిత రైతులకు నోటీసులు ఇచ్చాం. దీనిపై రెండు, మూడు రోజుల్లో గ్రామ సభలను ఏర్పాటు చేయబోతున్నాం.

హామీలు అమలు చేస్తారా...

గద్దె దిగుతారా?

- మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు 7

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (సోమవారం సాయంత్రం)
సహర్: 5:00 (మంగళవారం ఉదయం)

కాళేశ్వరం పరవళ్లు కనిపించడం లేదా?

కాంగ్రెసోళ్లకు కళ్లు ఉంటే చిన్నకోడూరుకి వచ్చి చూడాలి : హరీశ్‌రావు



కాలువలోని గోదావరి జలాలకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు పరవళ్లు తొక్కుతున్నాయని, కాంగ్రెసోళ్లకు కళ్లు ఉంటే చిన్నకోడూరుకి వచ్చి చూడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ కింద ఉన్న ఆర్‌డీ-1 కాలువ ద్వారా ఆదివారం చిన్నకోడూరులోని బెల్లంకుంటలోకి నీటిని వదిలారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు కాలువలోని గోదావరి జలాలకు పూజలు చేసి మాట్లాడారు. ఓవైపు ఎండలు మండుతున్నాయని, మరోవైపు కాళేశ్వరం జలాలతో చెరువులు మత్తళ్లు దూకుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అల్లీపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ అనసూయ, చిన్నకోడూరులో హమాలీ సంఘం అధ్యక్షుడు మల్లేశం, గాడిచెర్లపల్లిలో రాములు ఇటీవల మృతిచెందగా హరీశ్‌రావు ఆదివారం ఆయా కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు.

ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తా

సిద్దిపేట టౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో నిలదీస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 184 మంది లబ్ధిదారులకు ఆయన హరీశ్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట, మెదక్ జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో గళం విప్పుతానన్నారు. సిద్దిపేట అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధిస్తున్నారని, కొత్త పనులు లేవని, పాత పనులు ఆపారని మండిపడ్డారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజ్ కొడంగల్‌కు తరలించుకుపోయాడని, నర్సింగ్ కళాశాల, వెయ్యి పడకల ఆసుపత్రి, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, పోలీస్‌స్టేషన్ పనులు అన్నీ ఆపి రేవంత్‌రెడ్డి పగ పట్టారన్నారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలమైందని హరీశ్‌రావు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నారాయణరావుపేటకు చెం దిన మండేపల్లి రాజు, సిద్దిపేట భారత్‌నగర్‌కు చెందిన బొజ్జ లక్ష్మీనారాయణ కుటుంబాలకు పార్టీ ఇన్సూరెన్స్ రూ2 లక్షల చొప్పున బీమా చెక్కులను హరీశ్‌రావు అందజేశారు.

పౌల్ట్రీ.. పల్టీ

- గజ్వేల్ నియోజకవర్గంలో 2 లక్షల కోళ్ల మృత్యువాత
- వింత వ్యాధితో మరణిస్తున్న వైనం
- తీవ్ర నష్టాల బారిన పౌల్ట్రీ రంగం

గజ్వేల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో దాదాపు రెండు లక్షల కోళ్లు మరణించినట్లు తెలుస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోనే గజ్వేల్‌లో మొదటగా పౌల్ట్రీ ఇండస్ట్రీ ప్రారంభమైంది. జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన కొందరితో పాటు సిద్దిపేటకు చెందిన పలువురు దాదాపు 30 ఏళ్ల క్రితం తొలి పౌల్ట్రీ ఇండస్ట్రీని తీసుకువచ్చారు. పౌల్ట్రీ రంగం రాష్ట్రంలో ప్రస్తుతం కీలక ఇండస్ట్రీగా మారింది. అయితే, ఎన్నడూ లేనివిధంగా కోళ్లకు వింత రోగాలు వచ్చి మృతిచెందుతుండడంతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

ఒక్కో కోడికి ఒక్కో తీరు వ్యాధి

ఇప్పటికే గజ్వేల్ పరిధిలో దాదాపు రెండు లక్షల కోట్లు మృత్యువాత పడినట్లు పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. పది కోళ్లను పరిశీలిస్తే పదింటికి పది రకాల జబ్బులు వచ్చాయని, ఏ జబ్బుకు చికిత్స అందించాలో తెలియక తలలు పట్టుకున్నామని, చివరికి నష్టపోవాల్సి వచ్చిందని పౌల్ట్రీఫామ్ యజమానులు వాపోతున్నారు. రాయపోల్ మండలం రామారంలో



రాయపోల్ మండలం రామారంలోని పౌల్ట్రీఫామ్‌లో మృతి చెందిన కోళ్లు

నరేందర్‌రెడ్డి ఫామ్‌లో రెండు రోజులుగా 4 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ స్థాయిలో మరణిస్తున్నా పశువైద్యాధికారులు పట్టించుకోలేదని పౌల్ట్రీ యజమానులు వాపోతున్నారు.

కోలుకోవడం కష్టమే

పరిస్థితి ఇలాగే కొనసాగితే కోళ్ల పరిశ్రమ ఆరు నెలల నుంచి ఏడాది వరకు కోలుకునేది కష్టమేనని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. గుడ్లకు సైతం మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ భారీగా పడిపోయింది. దీంతో అటు లేయర్ ఫామ్స్ సైతం మూతబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మొక్కజొన్నలను సాగు చేసే రైతులకు పెద్ద ముప్పే పొంచి ఉంది. మక్కల ధర భారీగా పడిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు.





















'రోడ్డు పనులు ప్రారంభించాలి'

చిలప్‌చెడ్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గంగారం నుంచి ఫైజాబాద్ వరకు గల రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టి మాట్లాడారు. గంగారం, అజ్జమర్రి, బండాపోతుగల్, ఫైజాబాద్ గ్రామాలను కలుపుతూ పోయే రోడ్డు అధ్వాన స్థితిలో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

● 14 మందికి గాయాలు



మెదక్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామయంపేట బైపాస్‌లో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 14 మంది గాయపడ్డారు. నిర్మల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును మూలమలుపులో కామారెడ్డి డిపో బస్సు బలంగా ఢీకొన్నది. బస్సులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందితో పాటు కారులోని ఐదుగురికి గాయాలయ్యాయి. వెంటనే అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది బాధితులను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్‌ఐ బాలరాజ్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రాహుల్ అక్కడి చేరుకొని మిగతా ప్రయాణికులను ఇతర బస్సులు ఎక్కించి పంపారు. ఈ ఘటనతో అరగంటపాటు హైవేపై ట్రాఫిక్ జామ్ కాగా పోలీసులు వాహనాలను క్లియర్ చేశారు.

చోరీకి వచ్చి.. విద్యుదాఘాతంతో మృతి

జోగిపేట, మార్చి16 (ఆంధ్రజ్యోతి): చోరీకి వచ్చిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన జోగిపేట శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటకు చెందిన బుడగ జంగాల సంగమేష్ గ్రామ శివారలోని విద్యుత్ కేబుల్ వైర్లు చోరీ చేసేందుకు వచ్చి ప్రమాదమశాత్తు విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న సీఐ అనిల్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంగమేష్ మృతదేహం

చికిత్స పొందుతూ మహిళ..

పాపన్నపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లికి చెందిన జాల కిషనమ్మ(66) ఈ నెల 12 న ఇంట్లోకి వెళ్తుండగా మెట్లపై నీరు ఉండటంతో జారి కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో మొదట మెదక్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కొడుకు ఏసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..

చేగుంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చేగుంట శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైత్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం లక్నో జిల్లా వి.గొండ గ్రామానికి చెందిన అమర్ సింగ్ (35) చేగుంట శివారులోని జీవిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి చేగుంట గ్రామ శివారులోని ఊర చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అమర్ సింగ్ మృతదేహం

వ్యక్తిపై కర్రలతో మూకుమ్మడి దాడి

● ఆసుపత్రి పాలైన బాధితుడు

హత్నూర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిత్తు బొత్తు ఆటను అడ్డుకున్న వ్యక్తిపై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసి గాయ పర్చిన సంఘటన హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఆ గ్రామ శివారులోని మల్లారెడ్డి కుంట సమీపంలో కొందరు వ్యక్తులతో కలిసి ఈ నెల 14న హోలీ పండగ రోజు చిత్తు బొత్తు ఆట ఆడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన పార్వత మొల్ల మొగులయ్య వీరి అడ్డుకునే ప్రయత్నం చేసే క్రమంలో అక్కడే ఉన్న పూల శంకర్‌తో గొడవ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శంకర్ కుటుంబీకులు మరి కొందరు మొగులయ్యపై మూకుమ్మడిగా దాడి చేసి కాళ్లతో తన్నుతూ.. కర్రలతో కొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మొగులయ్య ఆసుపత్రిలో చికిత్స పొందున్నాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.



చికిత్స పొందుతున్న మొగులయ్య



మొగులయ్యపై దాడి చేస్తున్న దృశ్యం

లారీ,ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

మునిపల్లి, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : లారీ, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి కంకోల్ ఫ్లై ఓవర్ (బ్రిడ్జి) వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన సుల్తానా, బిస్మల్లా తన కుటుంబ సభ్యులు జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు ఆటోలో వెళ్తున్నారు. మునిపల్లి మండలం కంకోల్ (65వ జాతీయ రహదారి) ఫ్లై బ్రిడ్జివద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని సదాశివపేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లియర్ చేశారు.





నీడ లేదు.. నీరు కరువు

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో వసతులు లేక ఇబ్బందులు

కోహీర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సరైన వసతులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలువ నీడ, తాగేందుకు నీరు లేక తల్లడిల్లుతున్నారు. టెంట్లతో నీడ, తాగునీటి వసతి కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఎండ, వడగాల్పులు, ఉక్కపోతతో కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రస్తుతం కోహీర్ మండలంలో సుమారు 2 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్నందున పనికి వెళ్లే కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టెంట్లు అందించి కూలీలకు ఎండ నుంచి ఉపశమనం కల్పించాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా పని ప్రదేశాల్లో నేల గట్టిగా ఉండటంతో భూమిని తడిపేందుకు ట్యాంకర్లతో నీరు పట్టే వెసులు బాటు ఉన్నప్పటికీ అలా చేయడం లేదు కూలీలు ఆరోపిస్తున్నారు. పని సమయంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స అందించేందుకు అయోడిన్, బ్యాండేజి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలతో కూడి కిట్లు సమకూర్చాలి. కానీ ఎనిమిదేళ్లుగా వీటిని పంపిణీ చేయడం లేదు.





మారథాన్-2025 పోస్టర్‌ను విడుదల చేస్తున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి

రన్నర్ ఆఫ్ మారథాన్-2025కు దరఖాస్తుల ఆహ్వానం

కంది, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)లో నవంబరు 30న రన్నర్స్ హాఫ్ మారథాన్-2025 2వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు ఆదివారం ఐఐటీహెచ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు. ఇందులో బహుళ రేస్ విభాగాలు ఉన్నాయి. ఈ మారథాన్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల నుంచి ఫిట్‌నెస్ ఔత్సాహికులు, రన్నర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. పాల్గొనాలనుకునే వారు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మారథాన్‌లో 5కే రన్, 10కే రన్, మారథాన్‌లతో పాటు ఫన్‌రన్ ఈవెంట్‌లు ఉంటాయి. విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు, పతకాలు, బహుమతులు అందిచనున్నారు. ఈ రన్నర్స్ ఆఫ్ మారథాన్ అకాడమిక్ ఎక్సలెన్స్‌తో పాటు శారిరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.

దత్తగిరి ఆశ్రమంలో పూజలు



యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న కేశవరావు

ఝరాసంగం, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కే.కేశవరావు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన స్వామి వారి మాస అమరథితి కార్యక్రమానికి ఆయన హాజరుకాగా, ఆశ్రమ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలోని నవగ్రహాలకు, పంచవృక్షాలకు ప్రత్యేక పూజలు చేసి, యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూత గిరి మహారాజ్ ఆయనను సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు. మహామండలేశ్వర మహంత్ సిద్ధేశ్వరనందగిరి మహారాజ్, ట్రస్ట్ చెర్మన్ అల్లాడి వీరేషం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మందుల విక్రయం



క్లినిక్ లో మందులు

శివ్వంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ డాక్టర్లు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాల్సి ఉండగా నిబంధనలు తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా మందులు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మందులు అమ్ముతున్నారు. మండల పరిధిలోని కొత్తపేట రూప్లాతండాలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన ఇటుక బట్టీల కార్మికులను ఆసరా చేసుకుని ఏకంగా క్లినిక్‌లోనే మందులను విక్రయిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఇదే వ్యక్తి మందులు విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని అతడిని కోర్టుకు హాజరుపరిచారు. అయినా తీరు మార్చుకోకుండా మళ్లీ మందులు విక్రయిస్తున్నాడు. ధనార్జననే ధ్యేయంగా వ్యవహరిస్తున్న ఇలాంటివారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఔషధ నియంత్రణ శాఖ అధికారి చంద్రకళను సంప్రదించగా ఆర్ఎంపీలు ఔషధాలు విక్రయించరాదని లైసెన్సులు లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు చేపడతామన్నారు.

జీతం రూ.12 వేలు.. ఇచ్చేది రూ.6 వేలు

- అడిగితే పనిలో నుంచి తీసివేస్తామని బెదిరింపులు
- ఎఫ్ఏసీహెచ్ హెచ్ఎంపై స్కావెంజర్ల ఆరోపణలు

కొడిపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి తమకు నెలకు రూ.12 వేల జీతం వస్తున్నా.. కేవలం రూ.6 వేలే ఇస్తున్నారని కొడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే స్కావెంజర్‌లు మణెమ్మ, బాలమణి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో తమ గోడును వెల్లబోసుకున్నారు. తక్కువ జీతమైనా బతుకుదెరువు కోసం నిత్యం పాఠశాలను శుభ్రం చేస్తున్నామని, తమ కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం 250 నుంచి 500 వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసివారికి వేతనంగా రూ.12 వేలను ప్రభుత్వం అందిస్తున్నది. ఈ పాఠశాలలో 400 పైగా విద్యార్థులు ఉండగా, ఇద్దరు స్కావెంజర్లు పని చేస్తున్నారు. ఈ మేరకు వీరి వేతనం ఏపీవీఎస్ ఖాతాల్లో జమ అవుతున్నాయి. కానీ, ఎఫ్ఏసీహెచ్ ప్రధానోపాధ్యాయురాలు మాత్రం ఒక్కొరికి రూ.3వేలు చొప్పున రూ.6వేలే ఇస్తున్నారని, అది కూడా గత డిసెంబర్ వరకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. దీనిపై అడిగితే పని నుంచి తీసి వేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎంఈవోను వివరణ కోరగా ఈ విషయమై తమ దృష్టికి రాలేదని చెప్పారు.



విలేకరులతో మాట్లడుతున్న స్కావెంజర్‌లు మణెమ్మ, బాలమణి

పేదింటి విద్యా కుసుమం

- గజ్వేల్ వాసికి మొదటి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు



సాయికుమార్

గజ్వేల్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చాలా మంది కల. దాని కోసం గంటల తరబడి కష్టపడి చదువుతారు. కానీ కొందరు మాత్రమే ఉద్యోగ సాధనలో సక్సెస్ అవుతారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ ఉంది. ఒక్కో పోస్టుకు వేలల్లో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఒక్క ఉద్యోగం సాధించడమే కష్టమనుకుంటున్న ఈ రోజుల్లో ఓ యువకుడు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లి దండ్రుల కలను నిజం చేశాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన తాటి మురళి భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు తాటిసాయి కుమార్ మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. వీరిది పేద కుటుంబం, గత సంవత్సరం విడుదలైన గ్రూప్-4 ఫలితాలలో ఉద్యోగం సాధించి, గ్రూప్2 ఉద్యోగం వస్తదని వెళ్లలేదు. ఇటీవల విడుదలైన ఫలితాలలో గ్రూప్ 2లో 418 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-3లో 307 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 54వ ర్యాంకు సాధించాడు. 2018 బీటెక్ మెకానికల్ పూర్తి చేశాడు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన సల్మాకు సన్మానం

సిద్దిపేట కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సిద్దిపేటకు చెందిన సల్మా నేహను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. తాజాగా జూనియర్ లెక్చరర్‌లో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 76వ ర్యాంకు, మల్టీజోన్‌లో 38వ ర్యాంకు రావటంతో హనుమకొండలో జేఎల్‌గా పోస్టింగ్ వచ్చింది. సల్మానేహను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్ అయిన భర్త కష్టం, కుటుంబ పరిస్థితి చూసి బాధ్యతతో చదివి నాలుగు ఉద్యోగాలు సంపాదించి ఎంతో మందికి ఆదర్శం నిలిచిందని సల్మానేహను మెచ్చుకున్నారు. ఎంతో మంది మధ్య తరగతి మహిళలలకు, యువతి, యువకులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు.



మణికంఠేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఉద్యోగ విజేతలకు మంత్రి సన్మానం



సాయిని అభినందిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్ టౌన్/హుస్నాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 2లో 103వ ర్యాంకు సాధించిన అయిలేని మణికంఠేశ్వర్‌రెడ్డిని, అలాగే గత జనవరిలో వెలువడిన ఫలితాల్లో పంచాయతీ రాజ్ శాఖలో ఏఈ ఉద్యోగం సాధించిన సాయిని ఆదివారం ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, మణికంఠేశ్వర్‌రెడ్డి తండ్రి అయిలేని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తారా...

గద్దె దిగుతారా?

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

గజ్వేల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇస్తారా లేక గద్దె దిగిపోతారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సంఘా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన విశ్వావసునామ సంవత్సరం పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా జీతాలు ఇవ్వడానికి ఆర్బీఐ నుంచి నాలుగు వేల కోట్ల అప్పులు తెస్తున్నామని సీఎం చెబుతున్నారన్నారు. ఆయన మాటలు నమ్మిన తెలంగాణ ప్రజలు బతుకులు పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు అయిందన్నారు. ఆయన వెంట దర్శనం మాస పత్రిక సంపాదకులు, సీనియర్ జర్నలిస్టు మరుమాముల వెంకటరమణశర్మ, గజ్వేల్ బ్రాహ్మణ సంఘ నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్, నాయకులు కమ్మరి శ్రీనివాస్, మనోహర్, సురేష్ తదితరులు ఉన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- హోలీ పండుగకు ఇంటికొచ్చి అనంత లోకాలకు



నందిని (ఫైల్)

మెదక్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : హోలీ పండుగకు ఇంటికి వచ్చిన బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెల్మల నర్సింహాలుకు ముగ్గురు కుమార్తెలు. మొదటి కూతురు వివాహం కాగా రెండో అమ్మాయి వెల్మల నందిని (23) మేడ్చల్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. రెండు రోజుల క్రితం హోలీ పండగ సెలవులు ఇవ్వడంతో నందిని ఇంటికి వచ్చింది. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలి నుంచి తలుపు గడియ వేసుకొని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని అదే వీధిలో ఉన్న ఒకరు గమనించి గడియ బద్దలు కొట్టి ఆమెను దింపినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి. కేసును దర్యాప్తులో ఉంది.

బాలికపై బాలుడి లైంగికదాడి

- బాలికను సఖీ సెంటర్‌కు తరలింపు
- దర్యాప్తు చేస్తున్న పటాన్‌చెరు పోలీసులు

పటాన్‌చెరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బాలికపై 17 ఏళ్ల బాలుడు లైంగికదాడికి ఒడిగట్టిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ బస్తీలో నివాసం ఉంటున్న బాలిక(10)పై జరిగిన దారుణంపై తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వారు అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడు మాయమాటలు చెప్పి బాలికపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బాలిక అస్వస్థకు గురికావడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు అడగడంతో విషయం చెప్పింది. వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత బాలికను సఖీ సెంటర్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

తవ్వేయ్.. అమ్మేయ్..



జిన్నారం మండలం గడ్డపోతారం పరిధి 79 సర్వే నంబర్‌లోని సీలింగ్ భూమిలో మట్టి తవ్వకాలు

- జిన్నారం మండలంలో జోరుగా మట్టి దందా
- ప్రభుత్వ భూములు, కుంటల నుంచి రాత్రుల్లో తోడివేత
- అక్రమార్కులకు సిరులు.. ప్రభుత్వ ఆదాయానికి గండి

జిన్నారం, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలోని పలు గ్రామాల శివారు ప్రాంతాలు, కుంటలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టి అక్రమ రవాణా దందా జోరుగా సాగుతున్నది. రాత్రి వేళల్లో జేసీబీలు, టిప్పర్లతో నిత్యం యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. లక్షల రూపాయలు విలువ చేసే మట్టిని అక్రమార్కులు గుట్టుచప్పుడుకాకుండా రాత్రికి రాత్రే పరిశ్రమలు, నగర శివారు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామస్థాయిలో నిఘా వ్యవస్థ సరిగా లేకపోవటంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతున్నది.

ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు

జిన్నారం మండలంలో నిత్యం ఏదో ఒక చోట మట్టి అక్రమ దందా జరుగుతుంది. గడ్డపోతారం పరిధిలోని 79 సర్వే నంబర్‌లోని భైరవ కుంట, సీలింగ్ భూమిలో నెల రోజులుగా వందల సంఖ్యలో టిప్పర్ల మట్టిని తరలిస్తున్నారు. దీంతో కుంటలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వావిలాల శివారులో 190 సర్వే నంబర్‌లో ఇటీవల టీఎస్ఐఐసీకి కేటాయించిన స్థలంలో భారీగా తవ్వకాలు జరిపారు. రాళ్లకత్వ పరిధి 286 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలోనూ మట్టి దందా సాగుతుంది. కాజీపల్లి, మాదారం, జిన్నారం, కొడకంచి ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు.

రోజుకు రూ.25 లక్షల విలువైన మట్టి !

మట్టి దందా అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలం నుంచి నిత్యం 25లక్షల విలువ గల మట్టి రవాణా జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. నగర శివారులో నిర్మాణ రంగం, అపార్ట్‌మెంట్లకు మట్టి సరఫరాకు భారీగా డిమాండ్ ఉన్నది. అదేవిధంగా స్థానికంగా ఉన్న పరిశ్రమలు, ఇటుక బట్టీలకు జోరుగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ మట్టి రూ.6 వేల నుంచి 8 వేల వరకు ధర పలుకుతుండగా, రాత్రికి రాత్రే ఈ వ్యవహారం లక్షల్లో ఆర్జిస్తున్నారు. మట్టి అక్రమ దందాతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్నది. ఇక గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖకు నిఘా వ్యవస్థ లేక పోవటం, స్థానిక సంస్థలు అక్రమ మట్టి తరలింపును అరికట్టడం తమ పని కాదని భావించటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు.



విశేష పూలమాలల అలంకరణలో మల్లన్న



భక్తజనంతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

9వ వారం.. జన సందోహం

- పట్నాలు రచించి, బోనాలు నివేదించిన భక్తులు

చేర్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదవ వారమైన ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. గంగిరేగు చెట్టుకు ముడుపులుకట్టారు. స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్. శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

కొండపాక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. మండలంలోని అంకిరెడిపల్లి గ్రామంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, బ్యాంకు అధికారులమని ఫోన్ చేస్తే నమ్మవద్దన్నారు.

ఇంటింటికీ ఉచితంగా తాగునీరు

ములుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబానికి ఉచితంగా తాగునీరు అందిస్తానని కందాడి శంకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ములుగు మండలం అన్నాసాగర్ గ్రామంలో నూతనంగా వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తన సొంత డబ్బుతో ఉచితంగా తాగునీరు అందిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరు కార్డు ద్వారా నీటిని తీసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లేష్, రవీందర్‌రెడ్డి, సాయికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బోరు వేసి దాహార్తి తీర్చిన నాయకులు

ములుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు తాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ములుగు అంబేద్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న కాలనీలో కొన్ని రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుకొచ్చారు. కాలనీలో ప్రత్యేకంగా బోరు వేసి మోటర్ బిగించారు. దీంతో కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, మండల పార్టీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేద వధువుకు పుస్తె మట్టెలు

ములుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు సహాయం చేయడమే కేబీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండలం గంగాధర్‌పల్లిలో పేద కుటుంబానికి చెందిన సరస్వతి కూతురి వివాహం కోసం పుస్తెమట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తాను ముందుంటానన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ మమతతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గజ్వేల్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కొండంత అండగా సీఎంఆర్‌ఎఫ్ నిలుస్తుందని తాజా మాజీ సర్పంచ్ బాలచంద్రం పేర్కొన్నారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు రూ. 2,39,500 విలువ గల చెక్కులను లబ్దిదారులకు మాజీ సర్పంచ్ బాలచంద్రం ఆదివారం అందజేశారు.

స్నేహితురాలికి అండగా..

కొండపాక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలిచారు. మండలంలోని సిరసనగండ్ల గ్రామానికి చెందిన మిట్టపల్లి లలిత భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె తన కొడుకుతో కలిసి గ్రామంలోని అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. పదోతరగతిలో 2008-09 బ్యాచ్‌కు చెందిన ఆమె స్నేహితులు ఆమె కుటుంబ దీనావస్థను వాట్సాప్ గ్రూపులో పెట్టారు. ఇందుకు స్పందించిన మిత్రులందరూ పోగు చేసిన రూ.25వేలతో పాటు క్వింటాల్ బియ్యాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం స్పందించి లలిత కుటుంబాన్ని ఆదుకోవాలని, అలాగే డబుల్ బెడ్‌రూం మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మృతుడి కుటుంబానికి చేయూత

జగదేవ్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన హౌజ్ వైరింగ్ ఎలక్ట్రీషన్ కొడకండ్ల సాయికిరణ్ వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం జగదేవ్‌పూర్ మండల ప్రైవేట్ హౌస్ వైరింగ్ ఎలక్ట్రీషన్ అసోసియేషన్ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 27వేల నగదు, ఒక క్వింటాల్ 50 కేజీల బియ్యం, ఐదు కిలోల నూనెను అందజేశారు. కార్యక్రమంలో హౌజ్ వైరింగ్ ఎలక్ట్రీషన్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, కనకయ్య, కుమారస్వామి, నర్సింలు, వెంకటేష్, నవీన్ తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ అందుకున్న కమలాకర్‌కు ఎమ్మెల్యే అభినందన

మద్దూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన జంగిటి కమలాకర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం సన్మానించి అభినందించారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసిన కమలాకర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీలో చేరి చేంజింగ్ అర్బన్ గవర్నెన్స్ ఇన్ ఇండియా అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు డాక్టరేట్ అందుకున్నారు. ఆయన భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

పీహెచ్‌సీ పునరుద్ధరణ పనులకు మోక్షమెన్నడో?

● మూడేళ్ల క్రితం రూ.48 లక్షలు మంజూరు ● నత్తనడకన పనులు



స్లాబుపైన వృథాగా పడి ఉన్న వాటర్ ట్యాంకులు

మద్దూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పునరుద్ధరణకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద మద్దూరు, లద్నూరు పీహెచ్‌సీలకు రూ. 48 లక్షలు మంజూరు చేసి మూడేళ్ల గడిచినా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. గుత్తేదారు నిర్లక్ష్యం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల సిబ్బంది పాలిట శాపంగా మారింది. మద్దూరు ఆస్పత్రిలో కేవలం విద్యుత్ పనులతో పాటు ఆస్పత్రి ముందు సీసీ నిర్మాణం చేపట్టి డ్రైనేజీ, నీటి సరఫరాతో పాటు కలరింగ్ పనుల్ని అసంపూర్తిగా వదిలేశారు. ఆస్పత్రిలోని వాష్ రూంలతో పాటు ఇతర గదుల్లో నీటి సరఫరా లేకుండా పోయింది.

స్లాబుపైన వాటర్ ట్యాంకులు వృథాగా పడి ఉన్నాయి. లద్నూరులో కేవలం విద్యుత్ పనులు మాత్రమే పూర్తయినట్లు సిబ్బంది చెబుతున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించేలా అధికారులు చొరవ చూపాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాసమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



దుబ్బాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దుబ్బాక, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన అధికార కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీలో ప్రతిపక్షాలపై అప్రజాస్వామిక దాడులకు ఒడిగడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో మహిళలకు జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో జ్యోతీరావ్‌పూలే గురుకుల పాఠశాలలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి పరిస్థితిని తెలుసుకునేందుకు గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను పట్టించుకున్నపాపాన పోలేదని మండిపడ్డారు. యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని చెబుతున్న అధికార పక్షం ఆ నిధులతో ఉన్న హాస్టళ్లకు వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే, పేదవిద్యార్థులకు ఉపకరిస్తుందన్నారు. ఈ సమస్యలతో పాటు నియోజక వర్గంలోని సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రాజెక్టులు పూర్తిచేయడానికి, కాలువలను పూర్తిచేయడానికి నిధులను విడుదల చేయడంలేదని విమర్శించారు. రైతుల సమస్యల గురించి నిలదీసిన ప్రతిపక్షాలపై దూషణలకు దిగుతూ, ప్రతిపక్షాల గొంతును నులుముతున్నారన్నారు. వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, నాయకులు తదితరులున్నారు.

'కొమ్మూరి' కుటుంబానికి ప్రముఖుల పరామర్శ



కొమ్మూరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా, ఎంపీ చామల, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తూంకుంట నర్సారెడ్డి

మద్దూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి కొమ్మూరి సత్తెమ్మ ఈ నెల 13న మృతి చెందిన విషయం విదితమే. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తదితరులు ఆదివారం నర్సాయపల్లి గ్రామాన్ని సందర్శించి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, మాజీ సొసైటీ చైర్మన్ కామిడి రమేష్‌రెడ్డి, భూంరెడ్డి, నాయకులు ఉన్నారు.

దేవాదుల సాగునీటిపై ఎమ్మెల్యే ఎంపీ మాటామంతీ

భూగర్భజలాలు అడుగంటడంతో జనగామ నియోజవకర్గంలోని రైతుల పంట పొలాలు ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సాగునీళ్ల కోసం మా వంతుగా రైతాంగం పక్షాన పోరాటం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మీ వంతుగా సీఎం దృష్టికి తీసుకెళ్లి సాగునీరందించే ప్రయత్నం చేయాలని కోరారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చొరవ తీసుకోండి

● భువనగిరి ఎంపీకి జేఏసీ వినతి

చేర్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకోసం చొరవ తీసుకోవాలని కోరుతూ జేఏసీ నాయకులు ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆదివారం స్థానిక అంగడిబజారు చౌరస్తాలో జేఏసీ నాయకులు ఎంపీ చామలను కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎంపీ చామల మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామగల్ల పరమేశ్వర్, అందె బీరయ్య, కొమ్ము నర్సింగరావు, అందె అశోక్, ననవాల ప్రసాద్, బుట్టి సత్యనారాయణ, అందె నానిబాబు, కొండపాక భిక్షపతి పాల్గొన్నారు.



ఎంపీ చామలకు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

దళితులను వీసీలుగా నియమించిన ఘనత బీఆర్‌ఎస్‌దే

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లుగా దళితులను నియమించిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలో ఆదివారం సాయంత్రం కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. విశ్వవిద్యాలయాల వీసీల నియామకంపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తుందన్నారు. దళితులకు ప్రాధాన్యం కల్పించింది బీఆర్‌ఎస్ పార్టీయేనని, కాంగ్రెస్‌కు దళితులపై చిత్తశుద్ధిలేదన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపులేదని, దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేయడానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించలేమని అసమర్థత కనబరిచిందన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, అంకుగారి శ్రీధర్ రెడ్డి, పబ్బోజు విజేందర్, అనంతుల మల్లేశం, మంగోలు చంటి, పెడుతల ఎల్లారెడ్డి, శివగారి అంజయ్య, నిమ్మ రాజీవ్, ముస్త్యాల నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ప్రముఖులకు నాచగిరి బ్రహ్మోత్సవాల ఆహ్వానం



ఎంపీ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ అధికారులు

వర్గల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు జరిగే స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ ఆదివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఆహ్వానపత్రికను అందజేశారు. అదేవిధంగా నాచగిరి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



ఎండిన పంటలను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోయి తీవ్రనష్టాల పాలైన రైతుల వివరాలను ప్రభుత్వం సేకరించి పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బీఎస్పీ రైతుసంఘం రాష్ట్ర నాయకుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డ, మహ్మదాపూర్, పోతారం(ఎస్)లో ఎండిపోయిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికావడం లేదన్నారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా సాగు నీటిని అందించేందుకు అవసరమైన కాలువలను తక్షణమే పూర్తి చేసి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపరచాలని డిమాండ్ చేశారు. ఎండలకు దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో విచారణ జరిపి ఎకరానికి రూ. 40వేల పంటనష్టం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, మండల నాయకులు ఎం శ్రీనివాస్, పోచయ్య తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

చేర్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం నాగపురి శివారు గండికుంట కాలనీకి చెందిన పడాల చంద్రయ్య వ్యవసాయబావి వద్ద ఆదివారం పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు మృతితో రూ.80వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు చంద్రయ్య కోరారు.

స్పీకర్‌పై జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికాదు

● జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మల దహనం



దుబ్బాకలో దిష్టిబొమ్మ దహనం





గజ్వేల్, సిద్దిపేట పట్టణాల్లో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో పాటు ఆయనకు వత్తాసు పలికిన కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల చౌరస్తాలో, నారాయణరావుపేట మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి ల దిష్టి బొమ్మను దహనం చేశారు. దుబ్బాకలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కొంగరి రవి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఓడించినా వారి తీరు మారడం లేదని విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్కు చౌరస్తాలో టీపీసీసీ పిలుపుమేరకు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ .. దళితుడనే చిన్నచూపుతో జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను అవమానించారని, గవర్నర్‌ను కాంగ్రెస్ కార్యకర్త అని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జగదీశ్‌రెడ్డి శాసనసభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్గల్, రాయపోల్, జగదేవ్‌పూర్, అక్బర్‌పేట-భూంపల్లి, కొండపాక మండలకేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలతో ఊరేగింపు నిర్వహించి ప్రధాన చౌరస్తాల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోవడంతో సహనం కోల్పోయి విచక్షణారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

కొండపాక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి గ్రామానికి చెందిన సార్ల గణేష్, ఆయన బావమరిది చిక్కుడు సత్తయ్యతో కలిసి విశ్వనాథపల్లిలో బంధువుల ఇంటిలో శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కొండపాక శివారులోని మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో యూటర్న్ తీసుకుని విశ్వనాథపల్లికి వెళ్తున్న క్రమంలో అటువైపు అతివేగంగా వస్తున్న లారీ వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

మర్మాముల గ్రామంలో రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్మాముల గ్రామంలోని ఓ వృద్ధురాలి ఇంట్లో రేషన్ బియ్యం కొనుగోలు వ్యాపారులు నిల్వ చేశారు. ఈ సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు 5 క్వింటాళ్ల 50 కిలోల బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై తహసీల్దారుకు సమాచారమందించగా ఆర్‌ఐ రమేష్ పంచనామా నిర్వహించి, తహసీల్దారు ఆదేశాల మేరకు స్థానిక రేషన్ డీలరుకు అప్పగించారు.

ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి: టీపీటీఎఫ్



టీటీసీ భవన్‌లో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత సీఎంకు ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట టీటీసీ భవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వెంటనే పెండింగ్ డీఎలు చెల్లిస్తామని, ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలు చేస్తామని,పెన్షనర్స్ అందరికీ డీఏలు వెంట వెంటనే చెల్లిస్తామంటూ పలు హామీలు ఇచ్చినా, అమలు చేయకుండా వాయిదాలు వేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లోని 5 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. లేదంటే ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, సత్యనారాయణ, శివాజీ, అజీజ్, రామ్ రెడ్డి పాపిరెడ్డి, మంజుల, ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్లు జమీర్ మోహియొద్దీన్, జానకి రాములు, తిరుపతి పాల్గొన్నారు.

సీఎం మాట మార్చడం సరికాదు: తపస్



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు అన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంకతో మొండిచేయి చూపడం దారుణమని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను తీర్చడానికి హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించలేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగ నర్సిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వైవి శశి, జిల్లా బాధ్యులు లింగమూర్తి, శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షుడు దేవదాస్, జైపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గజ్వేల్: ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

గజ్వేల్/చేర్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమావేశం జరుపుకున్నారు. మర్కుక్ మండలం పాములపర్తి సమీపంలోని ఓ ఫాంహౌజ్‌లో సందడి చేశారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జడ్పీహెచ్‌ఎస్ 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు బోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.



చేర్యాల: ఆత్మీయ సమ్మేళనంలో జడ్పీహెచ్‌ఎస్ పూర్వవిద్యార్థులు

వృక్ష విలాపం

(5వ పేజీ తరువాయి)

హరీశ్‌రావు స్పందించి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తానే స్వయంగా చెట్లు నరికిన ప్రదేశాలను పరిశీలించి మండిపడ్డారు. కొద్దిరోజులు సైలెంట్‌గా ఉండి మళ్లీ నరికివేత కార్యక్రమాన్ని ఆరంభించారు. నిత్యం ఏదో మూలన చెట్లను తొలగించడం జరుగుతూనే ఉన్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇదే అదునుగా భావించి పలువురు వ్యాపారులు సైతం తమ దుకాణాల ముందున్న చెట్లను అడ్డు తొలగించుకుంటున్నారు.



సిద్దిపేటలో కొమ్మలతో సహా నరికివేసిన చెట్లు

పచ్చని చెట్లపై పర్యవేక్షణ ఏదీ?

గతంలో మొక్కల పెంపకం, చెట్ల సంరక్షణ కోసం హరితహారానికి అధికారులు, సిబ్బంది ఉండేవారు. కానీ ఇప్పుడా పరిస్థితే లేదు. కళ్ల ముందే చెట్లు నరుకుతున్నా అడిగేవారు కరువయ్యారు. కొన్ని చోట్ల మొక్కలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొన్నది. మొక్కల పెంపకంలోనూ టార్గెట్లు మరిచిపోయారు. దుకాణదారులు కూడా యథేచ్ఛగా తమకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఒకప్పుడు చెట్టు కొమ్మ నరికినా వేలల్లో జరిమానా వేసేవారు. కానీ నేడు చెట్లు మొదళ్ల దాకా వేటువేసినా పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, మున్సిపల్ యంత్రాంగం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే సిద్దిపేట హరితహారం మసకబారక తప్పదు.